క్లుప్తంగా

వై.వి.సుబ్బారెడ్డికి ఘన స్వాగతం


వై.వి.సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ రాజుబాబు, వైస్ ఎంపీపీ ప్రియాంక

హుకుంపేట: ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, అరుకు, పాడేరు నియోజక వర్గాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డి ఏజెన్సీ పర్యటనలో భాగంగా బుధవారం హుకుంపేట మీదుగా ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కూడా రాజుబాబు, వైస్ ఎంపీపీ ఒంటుబు ప్రియాంకతో పాటు నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ల సర్వే


సర్వే చేస్తున్న అధికారులు

దుంబ్రిగుడ: మండల వ్యాప్తంగా ఓటర్ల సర్వేను వేగవంతం చేస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం సొవ్వ, గసభ తదితర పంచాయతీల్లో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించారు. గడువులోగా సర్వే కార్యక్రమం పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. బీఎల్‌వోలు సంజీవరావు, రవి, రాములమ్మ, అనంత్‌రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

గూడెంకొత్తవీధి: చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని జీకే వీధి పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రింతాడ పంచాయతీలోని ఇంద్రనగర్‌లో చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. ఐదేళ్లలోపు పిల్లలు తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. గర్భిణులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎం కుమారి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన రేపు

మారేడుమిల్లి: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు శుక్రవారం మారేడుమిల్లి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 గంటలకు సున్నంపాడు, 11.45గంటలకు బోదులూరు గ్రామంలో నూతన సచివాలయ భవనాల ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 12.15 గంటలకు చట్లవాడ గ్రామంలో నూతన రోడ్డుకు శంకుస్థాపన, 2 గంటల నుంచి మారేడుమిల్లిలో గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు

కె.కోటపాడు : బ్యాంక్‌ల ద్వారా పాడి పశువులు పెంచే రైతులు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు పొందవచ్చని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.బైరాగి అన్నారు. ఎ.కోడూరు ఆర్బీకేలో బుధవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆర్బీకేలలో ఉన్న పశువైద్య సహాయకులను సంప్రదించి బ్యాంకుల ద్వారా క్రెడిట్ కార్డులు తీసుకోవాలని తెలిపారు. పశువుల కొనుగోలు, పెంచేందుకు రైతులు రూ. 25 వేల నుండి రూ.లక్ష వరకూ రుణం పొందవచ్చన్నారు. ఏడాదికి ఒక ఈత వలన పాల ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఉండదని, దూడ కూడా పుడుతుందని తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడపెయ్యిలు పుడతాయన్నారు. రెండు డోసుల వీర్యానికి రైతులు కేవలం రూ.500 మాత్రమే చెల్లించాలన్నారు. ఆడపెయ్యి జన్మించని పక్షంలో రైతులు వీర్యానికి చెల్లించిన నగదును వాపస్ చేస్తారన్నారు.

అతివలకు ఆర్థిక భరోసా

- స్వయం ఉపాధితో డ్వాక్రా మహిళల స్వావలంబన
- సున్నా వడ్డీతో సాయం
- అరకులోయలో 1,252 స్వయం సహాయక సంఘాలు


అరకులోయలో సమావేశమైన స్వయం సహాయక సంఘం సభ్యులు

అరకులోయటౌన్: స్వయం సహాయక సంఘాల్లోని అక్కా, చెల్లమ్మల ఆర్థిక స్వావలంబనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో ప్రోత్సహిస్తోంది. ప్రజా సంకల్ప యాత్రలో మహిళల ఆర్థిక ఇబ్బందులను చూసిన వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలు తీసుకున్న రుణానికి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అయిన తరువాత వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని నవరత్నాల పథకంలో చేర్చారు. ఏటా క్రమం తప్పకుండా వడ్డీ మొత్తాలను నేరుగా స్వయం సహాయక సంఘాల అప్పును ఖాతాలో జమ చేస్తున్నారు. అరకులోయలోని 1,252 సంఘాల్లోని 6,430 మందికి సున్నా వడ్డీ అందజేస్తున్నారు. పొదుపు సంఘాల కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటు అందిస్తోంది. 2019లో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని జగనన్న ప్రభుత్వం ప్రారంభించి, క్రమం తప్పకుండా అందజేస్తూ వస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న రుణాల మొత్తాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీని ప్రభుత్వం వర్తింపజేస్తోంది. స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాలోకి నగదును జమ జేస్తున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని 2022–23 ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన అన్ని సంఘాలకు ఆ సంవత్సరం తీసుకున్న కొత్త రుణాలను సైతం సున్నా వడ్డీ రుణాలను విడుదల చేసింది. సంఘం అప్పులో గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు మాత్రమే సున్నా వడ్డీ వర్తిస్తుంది. ఈ పథకం క్రింద అరకులోయ మండలంలోని 1,252 స్వయం సహాయక సంఘాల్లోని 6,430 మందికి రూ. 34,30,441 లబ్ధి చేకూరింది. ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి కుటుంబాలతో సంతోషంగా ఉన్నారు.

జగనన్న మేలు మరువలేం



మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం జగనన్న మేలు ఎప్పటికీ మరువలేం. జగనన్న చెప్పిన దానికంటే ఎక్కువ చేస్తున్నారు. గత ప్రభుత్వంలోని డ్వాక్రా రుణాలను మాఫీ చేయడంతో పాటు సున్నా వడ్డీని అమలు చేయడం ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతోంది.

– జనం మహాలక్ష్మి, సీ–కాలనీ, అరకులోయ

అభివృద్ధి పథంలో



ప్రభుత్వం సంఘాలు కోరిన మేరకు రుణ సదుపాయం కల్పించడమే కాకుండా వడ్డీ భారాన్ని తగ్గించింది. జగనన్న ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తుంది. ఫలితంగా సంఘాల ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయి.

– శెట్టి అప్పయ్యమ్మ, ఏపీఎం, అరకులోయ

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


గొందోలులో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ బ్రోచర్ అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు తదితరులు

- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- గొండోలు పంచాయతీలో గడప గడపకు విశేష ఆదరణ

అడ్డతీగల: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని గొండోలు పంచాయతీ సరంపేట, రాజుంపాలెం, గొండోలు గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 380 గడపలను వారు సందర్శించారు. ఇంటింటికి వెళ్లి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, గ్రామస్తులకు బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ పార్టీలకతీతంగా, పారదర్శకంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తోందన్నారు. సీఎం జగనన్న గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకు పాలనను తీసుకొచ్చారన్నారు. ఏళ్ల తరబడి కొండపోడు చేసుకుంటున్న గిరిజనులకు భూమి హక్కుపత్రాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజల పక్షాన నిలిచే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవాలని, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలంతా సమీకృతం కావాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకానికి చర్యలు


మాట్లాడుతున్న ఏపీవో కొండబాబు

చింతపల్లి: గంజాయి సాగు చేసిన గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా పండ్ల మొక్కల పెంపకానికి చర్యలు చేపడుతున్నట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కొండబాబు తెలిపారు. ఉపాధి పథకం వీఆర్‌పీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు గంజాయి తోటలు ధ్వంసం చేసిన గ్రామాల్లో వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 919 ఎకరాల్లో మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టామని, 2 లక్షల 12 వేల మొక్కలకు గాను 1లక్షా 87 వేల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మూడేళ్ల పాటు వీటి నిర్వాహణ ఉపాధి పథకంలో భాగంగా రైతులు చేపడతారని, ఉద్యాన, పోలీసు శాఖ అధికారులు పర్యవేక్షిస్తారని ఆయన చెప్పారు. ఈసీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతు సాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్ చెప్పారు. కోరాపల్లి పంచాయతీ పాలకొండ గ్రామంలో బుధవారం ప్రకృతి సాగు పద్ధతిలో గులిరాగి నాట్లుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గులిరాగి పద్ధతిలో నాట్లు వేయడంతో పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. రైతులకు ప్రకృతి సాగు పద్ధతులపై 15 రోజులకొకసారి అవగాహనపర్చాల్సిన అవసరముందన్నారు.
సేంద్రియ పద్ధతుల ద్వారా చిరుధాన్యాలు, పప్పు ధినుసులను పండించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌బీకేల్లో రాగులు కొనుగోలు చేస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీఆర్‌పీ కోరాబు సురేష్, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు అభినందనలు


సీఐ అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

గూడెంకొత్తవీధి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులను బుధవారం సహచర ఉద్యోగులు అభినందించారు. జీకే వీధి సీఐ అశోక్ కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా అధికారులను ఉపాధి పథకం ఏపీవో రామ్‌ప్రసాద్‌తో పాటు పలువురు ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందించారు.

20న ఆదివాసీ ఐక్యత సమావేశం

గంగవరం: మండల కేంద్రంలో ఈనెల 20న ఆదివాసీ ఐక్యత సమావేశం నిర్వహించనున్నట్టు ఆదివాసీ జేఏసీ మండల సభ్యులు కుంజం సిద్ధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆదివాసీ రాష్ట్ర సంఘ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ఆదివాసీ నాయకులు, స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నాడు–నేడు పనులు వేగవంతం


చిన్నారుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఎంఈవో బాబూరావుపడాల్

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీల్లోని పాఠశాల, సచివాలయాలను బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఎంఈవో సీహెచ్.బాబూరావు పడాల్ ఆకస్మికంగా సందర్శించారు. మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించిన జగనన్న విద్యా కానుక కిట్లు, బోధన, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును సమీక్షించారు. బడి బయట పిల్లల గురించి ఉపాధ్యాయుల నుంచి ఆరా తీశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో నాడు–నేడు ద్వారా చేపడుతున్న మరుగుదొడ్లు, వంటగది నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని వారు ఆదేశించారు. తాసరుబయలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిధిలో బడిబయలు పిల్లలు వివరాలు గురించి, ఎస్.పెదబయలు గ్రామాల్లో నాడు–నేడు పథకం కింద చేపడుతున్న పాఠశాల భవనం, ఇతర నిర్మాణ పనులను వారు పరిశీలించారు. సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు ఎస్.పెదబయలులో క్లస్టర్ వలంటీర్‌పై విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, సీఆర్పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏడీఎంహెచ్‌వో భాస్కర్, సీఐ రాంబాబు తదితరులు

అడ్డతీగల: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి ఎంతో మేలు జరుగుతుందని రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో కె.భాస్కర్ అన్నారు. స్థానిక కృపా అనాథశ్రమంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుడు నిస్సీకుమార్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని సీఐ వై.రాంబాబు ప్రారంభించారు. శిబిరంలో 16 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్‌వో భాస్కర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు, రక్తహీనతతో బాధపడే మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైతే నిల్వలు అందుబాటులో ఉంచాల్సిన అవసరముందన్నారు. ఈ మేరకు శిబిరాల వల్ల సేకరించిన రక్తం బాధితులకు అవసరానికి ఉపయోగపడుతుందన్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రక్త నిల్వలు ఉంచి ఈ ప్రాంత వాసుల అవసరాలు తీరుస్తామన్నారు. సేవా సంబంధమైన ఇటువంటి కార్యక్రమాల ద్వారా రక్తాన్ని సేకరించి వైద్య ఆరోగ్యశాఖకు అందివ్వడం వల్ల చాలా మేలు జరుగుతుందని సీఐ వై.రాంబాబు అన్నారు.ఎస్‌ఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బోధనలో మెలకువలు అవసరం


ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

రాజవొమ్మంగి: విద్యార్థులకు బోధనలు మెలకువలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎంఈవో–2 సూరారెడ్డి చెప్పారు. మండలకేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సులభ రీతిలో ఇంగ్లిష్ బోధనలపై ఉపాధ్యాయులకు విభవ సంస్థ ప్రతినిధులు బుధవారం అవగాహన తరగతులు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఆంగ్ల బోధనలో పాఠాల బోధనపై పలు మెలకువలను వివరించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయుల్లో ఇంగ్లీష్ ఒకాబ్యులరీ పెంచేందుకు సెల్‌ఫోన్ ద్వారా సూచనలందజేస్తున్నట్టు సంస్థ కో–ఆర్డినేటర్లు చందన, రుక్మిణి చెప్పారు. విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని తరచూ పరిశీలిస్తామని, ఇందుకు గూగుల్ ఫాంలను ఉపయోగిస్తామన్నారు. పాడేరు నుంచి వచ్చిన కో–ఆర్డినేటర్లు , మండలంలోని ఉపాధ్యాయులకు రెండు విడతలుగా డిజిటల్ తరగతులు నిర్వహించారు.

పంప్ ఆపరేటర్ సేవలు ప్రశంసనీయం


పంప్ ఆపరేటర్ సత్యనారాయణను సన్మానిస్తున్న సర్పంచ్, సిబ్బంది

ఎటపాక: గ్రామ పంచాయతీలో 20 సంవత్సరాలుగా బండారు సత్యనారాయణ పంపు ఆపరేటర్‌గా సేవలందించటం ప్రశంసనీయమని తోటపల్లి సర్పంచ్ మోసం దుర్గాలక్ష్మి అభినందించారు. ఉత్తమ పంపు ఆపరేటర్‌గా గుర్తించి బుధవారం సత్యనారాయణను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా విపత్కర పరిస్థితుల్లోనూ తన సేవలు కొనసాగిస్తూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని కొనియాడారు. టీపీ వీడు సర్పంచ్ మోసం రాజులు, ఉప సర్పంచ్ నరేష్, పంచాయతీ కార్యదర్శులు సుష్మ, శిరీష, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్‌ఎం పెంటమ్మ తదితరులున్నారు.

ముక్కుమూసుకోవాల్సిందే...

- డంపింగ్‌యార్డుగా గ్రామ చావడి ప్రాంతం
- పేరుకుపోయిన కోళ్ల వ్యర్థాలు, చెత్త
- పెరుగుతున్న దోమలు, క్రిములు
- ఆందోళనలో స్థానికులు


గ్రామ చావడి ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తగలబెట్టడంతో ఎగజిమ్ముతున్న పొగ

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి నడిబొడ్డున ఉన్న ప్రాంతం అధ్వానంగా మారింది. దుర్గంధంతో స్థానికులు నివసించలేని పరిస్థితి నెలకొంది. పేరుకుపోయిన చెత్తతో నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని దాదాపు 60 ఏళ్ల పూర్వ గ్రామ చావడిగా ఉన్న భవనం శిథిలదశకు చేరుకోవడంతో దాన్ని తొలగించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ ప్రాంతంలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. కోళ్ల వ్యర్థాలు, నిరుపయోగమైన ప్లాస్టిక్ వస్తువులతో ఈ ప్రాంతం అధ్వానంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దుర్గంధంతో నివసించలేకపోతున్నామని, ముక్కుమూసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెడుతుండడంతో దట్టమైన పొగతో చాలా ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఈ ప్రాంతం బహిర్భూమిగా మారిందని ఆందోళన చెందుతున్నారు. దోమలు, క్రిముల బెడద ఎక్కువైందని, రోగాలు ప్రబలుతాయని భయపడుతున్నారు. ఇదిలా ఉండగా పశువులు ఇక్కడున్న వ్యర్థాలను తిని అనారోగ్యం బారిన పడుతున్నాయని పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ దూడ మృతి చెందిందని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించి సమస్య పరిష్కరించి, ఈ ప్రాంతంలో కంచె ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే.. అంతే


భీసుపురం సమీపంలోని కాఫీ తోటలు వద్ద కోతకు గురైన రహదారి

అనంతగిరి:మండలంలోని భీసుపురం సమీపంలోగల కాఫీతోటలు వద్ద ప్రధాన రహదారి వర్షాలకు కోతకు గురికావడంతో సుమారు మూడు అడుగుల గొయ్యి ఏర్పడింది. దీంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనచోదకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరకు–విశాఖ ప్రధాన రహదారిపై డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు అంచు భారీ కోతకు గురైంది. అనంతగిరి సుంకరమెట్ట వరకు, అలాగే శివలింగపురం నుంచి అనంతగిరి వరకు రహదారి ఆనుకుని భారీగా కోతకు గురై, పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయని వాహనచోదకులు చెబుతున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలోని అదుపుతప్పి గోతుల్లో పడితే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్–5 శాఖాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో పాము కలకలం

గొలుగొండ : గొలుగొండ పీహెచ్‌సీలో బుధవారం రాత్రి నాగజెర్రి కలకలం రేపింది. పీహెచ్‌సీలోకి పాము రావడంతో సిబ్బంది ఆందోళన చెందారు. ఐదు అడుగులున్న నాగజెర్రి నేరుగా స్టాఫ్ రూమ్‌లోకి వెళ్లి దాక్కుంది. విషయం తెలిసిన వెంటనే సిబ్బంది స్థానిక యువకులకు సమాచారం ఇచ్చారు. దీంతో నలుగురు యువకులు వచ్చి పామును హతమార్చడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఆత్మీయ వీడ్కోలు


వైస్ ప్రిన్సిపాల్ పద్మలతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్‌నాయక్

అరకులోయటౌన్: మండల కేంద్రలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్స్‌పాల్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న పద్మలతను బుధవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలువాతో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు, మహిళా డిగ్రీ కళాశాలకు ఒక తల్లిలా సేవలందించారని అభివర్ణించారు. కళాశాలలోని అధ్యాపక బృందం, బోదనేతర సిబ్బంది ఆమె సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్స్‌పాల్ చలపతిరావు, పుష్పరాజ్, అధ్యాపకులు విజయలక్ష్మి, అనితా కుమారి, రామరాజు, రాజారావు, నాగబాబు, గణేష్, సుందరిరాణి, వర్తక సంఘం ప్రతినిధి రాజారావు, విద్యార్థులు పాల్గొన్నారు.